# చీకటి - వెలుగు

పదునెనిమిదేండ్ల ప్రాయమున రామయ్యకు సంసారభారము మీదబడియెను. ఇంటనొక వితంతు సోదరి, అవివాహిత యగు చెల్లెలొకతె, అరువది యేండ్ల తల్లి యుండిరి. తండ్రి మిగిల్చిపోయిన భూమిమీద రెండుపుట్ల ధాన్యము మాత్రమే వచ్చుచుండెను. వేఱు ఆదాయ మేమియు లేదు. ఆ స్వల్పాదాయము చాలని యవస్థ వచ్చెను.

ఆతనికేమియు పాండిత్యము లేదు. చిన్నతనమున చెప్పుకొన్న స్మార్తము మఱపునకు వచ్చినది. క్రాపింగు, మీసములు సంభావనకు తిరుగుటకు అభ్యంతరపెట్టుచుండెను. అయినను శివరాత్రికి కోటిపల్లి తీర్థమునందును, సుబ్బారాయని షష్ఠికి సంగమేశ్వరమునందును, అప్పుడప్పుడు వచ్చు పర్వములకు తొస్సిపూడి లాకువద్దను, నీటికాసు పట్టుట మానలేదు. సంసారము మీదబడిన వెంటనే గోదావరీ పుష్కరము వచ్చుటచే రాజమహేంద్రవరమున అతడు నూరురూపాయలు సంపాదించెను. అయితే వానిలో నలువది రూపాయలు తల్లితోబుట్టువులు చేసిన దానధర్మముల క్రింద నైపోయెను. ఉన్నప్పుడే జాగ్రత్తపడుట మంచిదని యాతడు సిగరెట్ల పెట్టెయొకటియు, చడావుల జోడొకటియు, పలుచని కంటిమెడ చొక్కాలు రెండును, విశ్వనాథ తైలము బుడ్డి యొకటియు, రెండు సెంటుబుడ్లును కొనుక్కొనియెను. ఇవన్నియు చూచి చెల్లెలు తనకు కొత్త పరికిణీయు, చొక్కాయును కావలయునని పట్టుపట్టెను. తల్లిపోరు వలన అవిగూడ కొనవలసి వచ్చెను. ఈబాపతు ఖర్చులును, రాజమహేంద్రవరములో పదునైదు దినములలోను ఆతని కయిన కాఫీ దుకాణపు సాదరు తొమ్మిది రూపాయలును పోను మిగిలిన యిరువది రూపాయలతో నాతడు రాయవరము చేరుకొనియెను.

"నేతిడబ్బులెన్నాళ్ళ కిత్తావయ్యా" యని బూలోకమ్మ వచ్చెను. "మరిసిపోనా వేంటి రెండు శేర్లట్టి కెళ్లేవు నూని"యని అప్పలమ్మ వచ్చెను. "పెరుగు డబ్బులు మూడుపావళాలియ్యాలి" అని వెంకమ్మ కూతురు నంపెను. "సిగరెట్లు, అగ్గిపెట్టిలు మూడురూపాయలయేయి. దోరపూడి సంత జరుగురు" అని షాహుకారు వచ్చెను. "జీతం మాటేంటి?" అని చాకలి పోతుగాడు వచ్చెను. ఒకటియు తప్పలేదు. తెచ్చిన రూపాయలు రెండు గంటలలో అయిపోయెను. సెనగలు తిని చేయి కడుగుకొనినట్లు అంతయు ముగిసెను.

మఱల అరువులు ప్రారంభమయ్యెను. ప్రాతబాకీ వసూలయిన పల్లెలలో ఇక అడుగుటయే తడవుగ అరువులకు లోటు వుండదు గదా? కొడుకు దూబరా ఖర్చులో తల్లి అమ్మకము కూడా పన జోడించగా మఱల బాకీదారులు ముట్టడించిరి.

ఒకసారి యిత్తడిగాబు ఖర్చుపెట్టెను. ఇంకొకమాఱు తండ్రి బంగరుతావళము అమ్మివేసెను. మఱియొక పర్యాయము తాతలనాటి దంతపుబరిణ విక్రయించివేసెను. "పెద్దాపురం మహారాజులుంగారు మీతాత తండ్రి చదరంగపు ఆటకు మెచ్చుకుని యిచ్చారుటరా అదీ. చెప్పినమాట వినరా నాయినా" అని తల్లి అనేకవిధముల జెప్పెను; గాని యాతడు మానలేదు.

## ②

ఇక అమ్ముట కేమియు లేదు. తల్లి వస్తువులన్నియు అయిపోయెను. భార్య సుబ్బమ్మ నగలడుగగా "యింకెప్పుడూ అమాట యెత్తకండి" అనియెను. చిల్లరబాకీలు పెరిగిపోయెను.

"యిదిగాదు పని. వూళ్ళో కూచుంటే సాగేటట్టు లేదు" అని యోచించి యాతడు రామచంద్రపురము వెళ్ళెను. "వుద్యోగం కోసం వెడుతున్నాన"ని చెప్పగా సుబ్బమ్మ తొమ్మిది గంటలకే అమర్చి పెట్టెను.

శోభనాచలం నాయడు బుగ్గమీసాలు మెలిపెట్టుకొనుచు ఒక ఉపాధ్యాయుని ఏమో ప్రశ్నించుచుండెను. రామయ్య సలాము చేయగా నాతడు తలయూపుతో నందుకొనియెను. బత్తాయి నారింజపండ్లను మాత్రము రెండుచేతులును చాచియే అందుకొనియెను.

మాట్లాడుచున్న ఉపాధ్యాయుడు వెడలిపోయెను. గుమాస్తాయు, బంట్రోతును తాలూకా బోర్డు కచేరీకి పోయిరి. లోపల ఉయ్యాల మంచము మీద నాయని భార్య, ఇవ్వల పడక కుర్చీలో నాయడు, ఎదుట చేతులు జోడించుకొని రామయ్య - ఈముగ్గురే యుండిరి.

"ఏమయ్యా వచ్చావూ?" అని నాయడడుగగా "ఏలినవారు కటాక్షించాలి. గొప్ప యింటివాణ్ణి. మాతండ్రిగారు రుణాలు చేసి నాకు జీవనాధారం లేకుండా చేశారు. నావొక్కడి లెక్క మీద నలుగురం బతకాలండి. వణ్ణం పెట్టించాలి తమరు; ప్రైమరీ పరీక్ష అయినాను. తమకి కాశీయాత్రా ఫలం లభిస్తుంది" అని రామయ్య చెప్పెను.

ముఖమున కరుణను ప్రతిఫలింపజేయుచు నాయడు "కాళీలు లేనట్టుగా వున్నాయయ్యా" అనగా లోపలనుండి భార్య "బీదస్థితిలా వుంది. బ్రాహ్మడు కూడానూ, ఉపాధి చూపించండి" అని చెప్పెను. రామయ్య చకితుడయ్యెను. "రేపు రావయ్యా చూస్తానూ" అని యినస్పెక్టరు చెప్పగా రామయ్య మఱల సలాము చేసి వెడలిపోయెను. నాయడు భార్యతో మంత్రాంగము ప్రారంభించెను.

మఱునాడు ఉదయము భార్యతో నాలోచించి నాయడు రామయ్యకు అనపర్తిలో నాల్గవ ఉపాధ్యాయుడుగా పనిచేయుటకు హుకుము ఇచ్చెను.

యుక్త సమయమున నాలుగుబళ్ళ సామానుతో ఈ తొమ్మిది రూపాయల ఉద్యోగస్థుడు అనపర్తిలో నెలకు రెండురూపాయల అద్దెటింటిలో ప్రవేశించెను.

## 3

ప్రధానోపాధ్యాయుడు ఆరితేరిన లౌక్యుడు. పైగా తన శాఖయే ఉద్యోగములకు తగిన దను నిశ్చయము కలవాడు. ఈకంటిమెడ చొక్కా చూచి యాతడు బొమలు ముడుచుకొనియెను.

"ఈ వుద్యోగం యెలా వచ్చిందయ్యా నీకూ?"

"శోభనాచలంనాయడు గారు దయచేశారండి"

"అవునయ్యా, ఈవుద్యోగాలు యివ్వడం వారే. యెవరిప్పించారు నీకూ? ఇదీ నేనడిగేది."

"నాయడుగారి భార్య సిఫార్సు చేశారండి."

"ఖర్చు ఏమాత్రం? భరవా లేదు లెండి చెప్పండి."

"ఏమీ లేదండి."

"సామానుకి బళ్ళ ఖర్చు యేమాత్రం అయింది?"

"యేడు రూపాయలు."

"యిక్కడికి రాయారం యెంత దూరం?"

"నాలుగు మైళ్ళండి."

"సెబాస్"

రామయ్య ఉద్యోగములో ప్రవేశించెను. "పేము బెత్తం వూపుతూ దర్జాగా కుర్చీ మీద కూచోవచ్చు" అని తలచిన రామయ్యకు కుర్చీకి బదులు కుర్చీపీట లభించెను. కుర్రవాళ్ళు పుస్తకము చూచి చదువుచుండగా అర్థము చెప్పవలయునని గంపెడాసతో రాగా ప్రధానోపాధ్యాయుని యేర్పాటు చొప్పున ఆతనికి క్రొత్తపిల్లల చేత గుంటఓనమాలు దిద్దింపవలసివచ్చెను.

"ఓనమాలు కుర్రవాళ్ళకు దిద్దుటకంటెను దిద్దించుటకు రామయ్యకు క్రొత్త. చిన్నతనములో ఇతనొక సంవత్సరము కష్టపడియున్నచో ఎందరో పెళ్ళికూతుళ్ళ మెడలలో మంగళసూత్రములు కట్టించుచుండవలసిన వాడతడు. ఎందరో విద్యార్థులకు స్మార్తము పంచదశకర్మలు సంతలు చెప్పవలసినవాడాతడు; గాని యాతని కావిచారము లేదు.

పాఠశాలలో ప్రవేశించిన నెలదినములకు సుబ్బారాయుని షష్ఠి వచ్చెను. అదృష్టవశమున నాడు శనివారము గూడనయ్యెను. రామయ్య రెండజాముల రాత్రివేళ బయలుదేరి వెడలిపోయెను. తక్కిన ఉపాధ్యాయులందఱును తొలినాడు బిక్కవోలు వెళ్ళదలచినవారు రైలువేళకు మెళకువ రాకపోవుటచే సూర్యోదయమైన నాలుగుగడియలకు బయలుదేరి సంగమేశ్వరము వెళ్ళిరి.

జామున్నర ప్రొద్దెక్కినది. గుడి ప్రాకారముల యందును, వెలుపటను, చెరువుగట్టుమీదను చాల కోలాహలముగా నుండెను. రామయ్య గ్రుక్కత్రిప్పుకొనకుండ పనిచేయుచుండెను.

ఏడిది పాఠశాల తనిఖీ మిషతో ఈ యుత్సవము చూచుటకే సకుటుంబముగా బయలుదేరిన శోభనాచలము నాయడు అప్పుడే చెరువు సమీపమునకు వచ్చెను. రామయ్యతోడి ఉపాధ్యాయులు గట్టుమీద నిలిచి ఆతనింగాంచి హేళనముగా మాట్లాడుకొనుచుండిరి.

అధికారియు ఉపాధ్యాయులును కలిసికొనిరి. వారందఱును రామయ్య నొక్కమాఱే చూచిరి. అందరును హేళనము చేసిరి.

"మీరుగూడా వెళ్ళి సంపాదించుకోండి."

"అది మా కులవృత్తి గాదండి."

"అది బ్రాహ్మణ వృత్తే గాదూ?"

"మేము కరణాలమండి."

"కరణాలంటే యెవరూ?"

"నియోగులండి."

"నియోగుల వృత్తి యేమిటో?"

"తమకి తెలవందేముందండి? కరణీకాలు చేసుకోవడమూ, తమవంటి వారి నాశ్రయించి యేదో నౌకరీ చేయడమూ - దస్తావేజులూ, కవులు కదపాలూ - ఇలాంటిదండి మావృత్తి."

"మీరు బ్రాహ్మలే అయితే నౌకరీ బ్రాహ్మణ వృత్తిటయ్యా?"

"ఏదో అలా అలవాటయిందండి మాశాఖకి."

"వైదికుల్లో కొందరికది అలవాటయింది. యెక్కడా అందరికీ వకటే వృత్తి వుండదు. మొత్తానికి బ్రాహ్మడైన వాడికి వైదికవృత్తే మంచిది."

ఇట్లు చెప్పి నాయడు చెరువులో దిగెను. వెనుక ఆతని భార్య గూడ దిగియెను. యెనిమిదేళ్ళ కొడుకును జవాను దింపెను. నాయడు "మాకు స్నానం చేయించవయ్యా" అని రామయ్యను పిలిచెను.

అతడులికిపడి చూడగా ఎదుట తనపై అధికారి సబ్బుసిష్టెంటు యినస్పెక్టరు. మందహాస వదనయగు ఆతని భార్య, జవాను అక్కడే యుండెను. ఇది యంతయు జూచి తొలుత నాతడు రిచ్చపడెను. కాని తుదకు ధైర్యము తెచ్చికొని సంకల్పము చెప్పెను. "మంచి బ్రాహ్మడవు." అని చెప్పి భార్యచేతను, కొడుకు చేతను ఒక్కొక్క పావులా యిప్పించి తానొక పావులా యిచ్చెను. జవాను అణా యిచ్చెను. రామయ్య మొదట వలదని చెప్పి బలవంతము మీద పుచ్చుకొని వెంట బయలుదేరగా నాయడు "వుండండి. సంపాదించుకోండి" అని వెనుకకు పంపివేసెను.

మఱల యథాప్రకారము సిగరెట్లు మున్నగునవి కొనగా మిగిలిన పంద్రెండు రూపాయలతోడను రాత్రి పదిగంటల కాతడు ఇంటికి చేరెను.

## 4

ఇనస్పెక్టరు మారెను. శోభనాచలము నాయడు పోయి వేంకటాచలము పంతులు వచ్చెను. అందఱితో పాటు అనపర్తి హెడ్‌మాష్టరు గూడ వెళ్ళి దర్శనము చేసి వచ్చెను. రెండుమాసములలో పంతులు తాలూకా అంతా గిఱ్ఱున తిరిగి వచ్చెను. ముప్పది ముగ్గురు ఉపాధ్యాయులు ట్రైనింగునకు పంపబడిరి. వృద్ధులను కారణమున ఎనమండుగురు తొలగింపబడిరి. "బోసినోరూ నీది. నీమాటలు కుర్రాళ్ళకి తెలవవ"ని యొక వృద్ధ ప్రాయుడు తొలగింపబడెను. అక్టింగులు ముగిసినవారు గూడ ముప్పాతిక మువ్వీసము తిరస్కరింపబడిరి. లోపములు వెంటనే పూర్తియయ్యెను. "అందర్నీ బ్రాహ్మల్నే వేశాడు"అని బ్రాహ్మణేతరులును, "పద్ధతి నియోగంలా వుందయ్యా"అని వైదికులును అసంతృప్తులయిరి. "చప్పుడు కాకుండా కాలం గడిపేద్దాం"అని నిశ్చయించుకొనియున్న తాలూకా బోర్డు అధ్యక్షుడు ఏమియు కలుగజేసికొనలేదు.

రామయ్య ఈవడిసెల చేతిలో నుండి రాజమహేంద్రవరములో బడియెను. ఆతడు సామానంతయు తొట్టిపడవలో వేయించుకొని వచ్చెను. యిన్నీసుపేటలో నాతడు అరురూపాయల అద్దెటింట మకాము చేసెను.

కాలము గడచిపోవుచునే యున్నది. దానితో ఋణముగూడ పరువెత్తెను. ఒక సంవత్సరము ట్రైనింగు గడుచునప్పటికి ఋణము వేయిరూపాయలకు దాటెను. ఆతడు ఇల్లు అమ్మకమునకు చెప్పివచ్చి రెండవ సంవత్సరమున బడెను.

రెండు మాసములు గడచిన తరువాత తెలికుల అప్పలస్వామి వచ్చి యింటిని అయిదు వందల రూపాయలకు అడిగిపోయెను. వీధిశూల యుండుట వలన మఱెవ్వరును పోటీకి నిలువలేదు. "ఎప్పటికేనా ఈ బాధ వుండీదే" అని భార్య సలహా చెప్పగా రామయ్య ఆయిదొందవందలకును అమ్మివేసి వచ్చెను.

దానివలన ఫాయిదా తీరగా అసలు కొంత మాత్రమే తీరెను. గృహకృత్యములకు గూడ కొంత మిగుల్చుకొనవలసి వచ్చెను. మొత్తము మీద ఋణము ఋణము వలెనే యుండెను. యిల్లు యెగిరిపోయెను.

మఱల నాలుగు మాసములు గడచెను. అప్పిచ్చిన చౌదరయ్య వచ్చి నిక్కచ్చి చేసెను. "రూపాయలు గుమ్మరించు. లేకపోతే బూమి రాసియ్యి" అనియెను. మార్గము తోచలేదు రామయ్యకు. "ఏమిస్తావ"ని తల్లి యడుగగా ఋణదాత "బాకీ పోను రెండువందలిస్తాన"నియెను. రామయ్య ఉలికిపడి "చాలు నీ బేరం. పద సొమ్ము తెచ్చి, యిచ్చేస్తాను" అనియెను.

శనివారము సాయంత్రము బయలుదేరి పోయి ధరలు వాకబు చేసి రామయ్య ఒక యకరము భూమి అమ్మకము చూపెను. తెల్లవాఱునప్పటికి ఈసంగతి ఊరంతయు దెలిసెను. అనేకులు సొమ్ము లెక్క చూచికొనిరి. రాయబారులు వచ్చి రామయ్యను ముట్టడించిరి. కొందరు రైతులు స్వయముగనే వచ్చిరి. "యెంతకిస్తావంటే నేనేం చెప్పనూ? ఆజుబాజుల ధరలకు తక్కువ యివ్వను. ఎక్కువ రాదు. మీరే చెప్పండి" అని రామయ్య చెప్పగా గాడిగట్టుగల యొక రయితు "యిరవై అయిదు వందల"నియెను. ఇంకొకడు "పైగా నేనో యాభయి" అనియెను. "రెండెకరాలు యిచ్చేస్తే మూడువేలు" అని యొకడనియెను. "ఆలోచిస్తాన"ని రామయ్య చెప్పెను.

తరువాతి శనివారము నాడు మఱల వెళ్ళి ఒకయకరము భూమి రెండువేల యెనిమిది వందల కమ్మి వచ్చెను. ఋణము పోగా పదునెనిమిది వందలు మిగిలెను. రామయ్య మునుపటి వలె ఇప్పుడు ఋణగ్రస్తుడు గాడు. ధనికుడు.

## 5

ట్రైనింగు అయిపోయినది. రామయ్య విజయము బడసెను. సెలవుల యనంతరము ఆతనికి కోరుమిల్లి బదిలీ అయ్యెను.

రామయ్యకు ఆత్మగౌరవము పెరిగినది. కాకేమి? మునుపటి వలె నాతడు ఋణగ్రస్తుడు గాడు. పట్టాగూడ వచ్చినది. ఉద్యోగము ఖాయమే. కానయితే ఆపాఠశాలలో నాతడు ఆఱవ యుపాధ్యాయుడే. కాని ప్రధానోపాధ్యాయుని కయిన అంత దర్జా లేదు.

పాఠశాలకు సంబంధించిన ఉద్యోగులెవరు వచ్చినను ఆతని యింటనే భోజనము. పరదేశులెందరు వచ్చినను గూడ అక్కడే. నిజమునకు ఆతడు పండ్రెండు రూపాయల జీతగాడే; అయితే మాత్రమేమి లోటు? జీతము నేతిమజ్జిగలకు కటాకటీగా సరిపోవుచుండెను.

శివరాత్రి వచ్చినది. కోటిపల్లి సమీపమే; గాని ఆతడు మునుపటివాడుగాడు. "నాకేం నీరుకాసు పట్టేదాకా?" అని యాతడు తలంచెను.

మూడేండ్లు గడచినవి. ఈ మూడేండ్లలోను అతనికి ఆఱు బదిలీలయ్యెను. అంతటను గూడ "అడకువ లేదు. చెప్పినమాట వినడు" అని ప్రధానోపాధ్యాయుడు రిపోర్టు చేయుటయే తటస్థించెను.

అయిదేళ్ళనాడు రామయ్యను ట్రైనింగునకు పంపిన పంతులు మఱల వచ్చెను. అప్పుడు రామయ్య కొప్పవరములో ప్రధానోపాధ్యాయుడై యుండెను.

# 6

ఇనస్పెక్టరు సకుటుంబముగా కొంకుదురు నుండి సాయంత్రము ఏడుగంటలవేళ జిల్లా బోర్డు ప్రసిడెంటు గారి పడవలో వచ్చి దిగియెను. అంతకు మునుపు తాఖీదు వచ్చి యుండకపోవుటచే రామయ్య జవాను చెప్పగా అదలిపోయెను. ఈ యడలు మారుమొగము పెట్టక పూర్వమే పదేళ్ళపిల్లను నడిపించుకొనుచు పంతులు వచ్చెను. "ఈ కంకర రాళ్ళమూలాన కాళ్ళు బద్దలాసిపోతున్నాయండీ" అని అతని వెనుక భార్య వచ్చెను. "దయ చెయ్యండి" అని చెప్పుచు రామయ్య వారిని పాఠశాలా భవనమునకు తీసికొని పోయి అందు విడియించెను.

బడిపిల్లలలో ఇద్దరు పెద్దలను తీసికొని రామయ్య ఊరిలో ప్రవేశించెను. ముగ్గురును అరగంట తిరిగిరి. రెండు రూపాయల ఖర్చుతో అప్పుడు కాచిన నేయియు, కమ్మని పెరుగును వచ్చెను. శేరుపాలు దొరకుట బ్రహ్మాండ మయ్యెను.

ఇంట బంగాళాదుంపలు సిద్ధముగానే యుండెను. వంట యాలస్యము కావచ్చునని చెప్పి రామయ్య కాఫీ తయారు చేసి వారికి యిచ్చి వచ్చెను.

రాత్రి తొమ్మిది గంటలకు వియ్యాలవారికి పెట్టినంత కంటెను అధికముగ నాతడు అధికారికి భోజనము పెట్టెను. భోజనానంతరము అధికారి దగ్గరకు బోవుచు జవాను "మళ్ళీ నిన్నెక్కడికేనా విసిరేస్తాడు. జాగర్తగా చూచుకోవయ్యా" అని చెప్పి పోయెను.

మఱునాడు ప్రాత:కాలము రామయ్య పాఠశాలకు వెళ్ళి అధికారికి మేలుకొలుపులు పాడెను. రాత్రియే బోధింపబడిన పెద్ద విద్యార్థులు పాలు వగైరాలు అక్కడికి తేగా రామయ్య స్వయముగా కాఫీ చేసి వారికిచ్చెను.

ఏడున్నర కొక్కొక్క బాలుడే రాగా రామయ్య అందఱ చేతను అధికారికి నమస్కారము చేయించి "అమ్మవారి గుడి అరుగుమీద కూచుని చదువుకుంటూ వుండండి" అని పంపివేసెను. మానేటర్లు మాత్రము అక్కడనే యుండిపోయిరి.

అధికారి పాఠశాలా ప్రస్తావము ప్రారంభించి రామయ్య కుటుంబ వ్యవహారములోనికి దిగెను. అది కొంత నడచిన తరువాత తన భార్య యొక్కయు, కొమార్త యొక్కయు మార్దవమును, వైభవమును వర్ణించి చెప్పెను. తుదకు "ఏం చెప్పుకోనయ్యా? నూరు రూపాయల జీతమూ మావాళ్ళకి ఫలహారాలకి చాలడం లేదు. యింటి దగ్గిర కాస్తో కూస్తో వున్న వాణ్ణి గనక కాలం గడుస్తోంది" అని ముగించెను. ఇది విని "వంట ప్రయత్నం చేయిస్తాను" అని చెప్పి రామయ్య వెడలిపోయెను. ఒక కుర్రవాడు డేకిసాయు, వంటచెరకును అక్కడకే తెప్పించి నీళ్ళు కాచెను. "మీరు తలంటుకొని చాలా రోజులయిందండీ. అమ్మాయికి అంటి వారం అయింది. నామాటకేం లెండి, ఈ కవలాళ్ళ మూలంగా ఆరోగ్యం చూసుకోడానికి

వీల్లేకుండా వుంది. విశ్వనాథాయిలు అయిపోయింది. అమ్మాయి ఈవేళ తల దువ్వుకోవడం కష్టమే. మేష్టరుగారికి లెక్క పంపించండి. తెప్పించి యిస్తారు" అని యజమానురాలు చెప్పుచుండగా రామయ్య గులాబి పువ్వులు పట్టుకొని వచ్చెను. జవాను సంగతి యంతయు జెప్పగా రామయ్య "అవును. మరిచిపోయాను" అని మంగలికి కబురుచేసి విద్యార్థులచేత యింటినుండి అవసరవస్తువులను తెప్పించెను. అధికారి "ముందు అమ్మాయికి తలంటు" అనియెను. ఈమాట వినుటతోడనే రామయ్యకు "మరి అమ్మగారు మాత్రం మిగలడం యెందుకూ?" అని తోచెను. వెంటనే యాతడు ఇంటికి బోయి అధికారి భార్యకు తలంటి రమ్మని తల్లిని పంపెను.

భార్యయు అక్కయు పదిగంటలకు వంట తయారు చేయగా రామయ్య అధికారి కుటుంబమును వెంటబెట్టుకొని వచ్చెను. బొబ్బట్ల పిండివంటతో పదకొండుగంటలకు భోజనము లయ్యెను. "యిదీ పద్ధతి" అని జవాను మెచ్చుకొనియెను. "మూడు గంటలకి ఏదేనా ఫలహార ప్రయత్నం చేయించండి" అని గూడ ఆతడు చెప్పెను.

విద్యార్థులు వచ్చినంత వఱకును చెంగుడిగుడి కొందఱు, ఉప్పట్టి కొందఱు, గోళీలు కొందఱు, కోతికొమ్మచ్చులు కొందఱు ఆడుకొని వెడలిపోయిరి.

## 7

అధికారి కుటుంబము నిద్రనుండి లేచునప్పటికి రెండుగంటలయ్యెను. విశ్వనాథతైలము రామచంద్రపురము నుండి తెప్పించవలసి వచ్చుటచే మూడుగంటలకు గాని అమ్మాయికి తల దువ్వుట ముగియదయ్యెను. ముఖప్రక్షాళనాదులన్నియు ముగిసిన తరువాత రామయ్య మఱల "యింటికి దయచెయ్యాలి" అని యాహ్వానింపగా అధికారిణి "యిక్కడికే తెప్పించండి" అనియెను. ఆవడలు, ఉపమా, వంకాయబజ్జి రామయ్య తెచ్చెను. కాఫీ విద్యార్థి తెచ్చెను. జవాను పళ్ళెములు తీసి ఈయగా అధికారి కుటుంబము ఫలహారము ముగించి గఱ్ఱున తేన్చెను. గ్రుక్కతిరుగకుండ ఆవడలు తినుచు జవాను "నీవిశ్వాసం అస్థిని పట్టిపోతుందయ్యా" అనియెను.

తాంబూలసేవనము గావించుచు "మఱి స్కూలు మాట యేమిటి? పరీక్ష చేద్దామా?" అని యధికారి పలుకగా "పిల్లల్ని తీసుకురండిరా" అని రామయ్య విద్యార్థుల కిరువురకు ఆజ్ఞాపించెను. ఇంతలో అధికారి కూతురు వచ్చి "నాన్నగారూ, ఈవూళ్ళో వేడిబెల్లం దొరుకుతుందిటండీ. తెప్పించరూ" అనియెను. అధికారి తనదెసకు జూడగా "చిత్తం. పట్టించుకు వస్తాను" అని రామయ్య బయలుదేరి పోయెను. "పరీక్ష రేపు పొద్దున్న చేద్దాం లేండి" అని అధికారి పలికిన మాట ఆతనికి గుమ్మము దాటునప్పటికి వినబడియెను.

రాత్రి పదిగంటలకు గడ్డపెరుగుతో మఱల భోజనము లయ్యేను. ఇనస్పెక్టరు ఆజ్ఞ చొప్పున బంగాళాదుంపల వేపుడు కూరయు, మిరియాల చారును మాత్రమే చేయబడియెను.

తెల్లవారినది. నాడు సుబ్బారాయని షష్ఠి. మైలు దూరములో నున్న మహేంద్రవాడలో గొప్ప ఉత్సవము.

తన చెవిని బడుటకే అధికారి దంపతులు ప్రక్క గదిలో మెల్లగా చెప్పుకొనిన మాటలను విని రామయ్య వారిని మహేంద్రవాడ ప్రయాణము చేసెను.

## 8

బిళ్ళబంట్రోతు యెదురుపడునప్పటికి మహేంద్రవాడ ఉపాధ్యాయుడు ప్రమాన్పడెను. "ఈశ్వర సేవకి బదులు నరసేవ. ఏమిటి చెయ్యడం? ఈశ్వర కోపాన్నైనా సహించవచ్చు గాని ఈయధికారుల అతృప్తిని భరించడం సాధ్యం కాదు" అని అనుకొనుచునే యాతడు దర్శనార్థము వెడలిపోయెను.

స్నానము అయిన పిదప దేవతాదర్శనము. పిదప పిల్లకు అవియు నివియు గొనుట; అధికారి పదింటికి బయలుదేరి కొప్పవరము వెడలిపోయెను.

కొప్పవరములో పదకొండు గంటలకు పూరీలతోడను, పులిహోర తోడనుభోజనము లయ్యేను మఱలమధ్యాహ్నము ఉపాహారము ముగిసిన తరువాత విద్యార్థుల పరీక్ష ప్రారంభమయ్యేను. ముప్పది యిద్దరు మంత్రుల చరిత్ర చదువుకొనుచు పంతులు పడక కుర్చీలో కూర్చుండెను. బిళ్ళబంట్రోతు క్రింది తరగతులను పుచ్చుకొనియెను. రెండవ తరగతిని మూడవ తరగతిని రామయ్య పుచ్చుకొనియెను. పరీక్ష పూర్తిగా అరగంట పట్టెను. పాఠశాలను గుఱించి షరా వ్రాయుట గూడ ఈయరగంట యందే అయ్యేను.

పొలోమని కేకలు వేయుచు విద్యార్థులు వెడలిపోయిరి. పంతులు ఉస్సురనుచు లేచి పచారు ప్రారంభించెను. రామయ్య చేతులు జోడించుకొని సమీపమున నిలిచి యుండెను.

"షరా యేం రాశినా పాఠాల విషయములో మీఅశ్రద్ధ స్పష్టముగా కనబడుతోంది. ముందు నుంచి జాగర్తగా వుండాలి."

"చిత్తం"

"నాకు యెవరికీ అపకారం చెయ్యడం యిష్టం లేదు. తినీతినీ వణ్ణం తీసెయ్యడం మంచిది కాదు."

"చిత్తం చిత్తం. కనిపెడుతూ వుండాలి యేలినవారు. తమ బిడ్డలం."

"యిక్కడ మీకు సుఖంగా వుందా?"

"యేదో వుందండి."

"మీకు అవసరమయితే బదిలీ ప్రయత్నం చేస్తాను."

"తమ అనుగ్రహం. రాయారం మారిస్తే యింటి అద్దె తగలదండి. సొంతవూళ్ళో లాభం - అంటే సుఖం యెక్కువగా వుంటుందండి. ప్రభువులు కటాక్షించాలి."

"నాతో పదిమాట్లు చెప్పక్కర్లేదు. ఆలోచిస్తాను."

ఈ మాటలు విని రామయ్య క్షణములో వచ్చెదనని చెప్పి బైటకు వెళ్ళెను. రాత్రి క్షీరాన్నముతో విందుచేసి రామయ్య పంతులుభార్యకు ఉప్పాడ జరీచీరయు, కొమార్తకు పరికిణీయు బహుమతి చేసి ఉదయము జట్కామీద రామచంద్రపురమునకు పంపివేసెను.

## 9

రామయ్య మురుగు కాలువ వఱకును వారిని సాగనంపి వెనుకకు మఱలు నప్పటికి చౌదరయ్య కలిసికొనియెను.

"యింటిదాకా రానక్కర్లేకుండా మా బాగా దొరికేవయ్యా. రా యిక్కడ కూకుందాం."

"నేను నుంచునే మాట్లాడతాను. కావలిస్తే నువ్వు కూర్చో."

"కూచోడానికీ, నుంచోడానికీ యేం వుందీ? బాకీ యెంత పెరిగి పోయిందో లెక్క చూసుకున్నావా?"

"నువ్వు చెప్పరాదూ?"

"యకరం బూమికీ సరిపోద్ది."

"ఏమంటావు?"

"ఆపడానికి ఈల్లేదు."

"వుపాయం చెప్పు."

"భూమి రాసెయ్యి."

"పైగా యేమిస్తావు?"

"దస్తావేజు ఖర్చులు పెట్టుకుంటాను మరి."

"మంచి అనుగ్రహమే. రేపు వచ్చి మాట్లాడతాను పద."

"యిదుగో. పదిమాట్లు చెప్పడం నాచేత గాదు. నెల్లాళ్ళు సూత్తాను."

ఇరువురను విడిపోయిరి. రామయ్యకు దిక్కులు తెలియలేదు. "మేష్టరీ లేకమునుపు రెండెకరాల భూమీ, కొంపా వుండీవి. ఈ సంపాదన మొదలయేక సర్వనాశం వచ్చింది. కొత్తనీరు వచ్చి పాతనీటిని కొట్టుకుపోయింది. యేమిటి దారి యింక?" అని యోచించుకొనుచు నాతడింటికి పోయెను.

ఆతడీ వ్యవహారపు టాలోచనలలో పడి యీాదుకొనుచుండగా తాలూకా బోర్డు నుండి "యిరువది నాలుగుగంటలలో పసలపూడి వెళ్లి ఛార్జీ పుచ్చుకోవలసినద"ని హుకుము వచ్చెను.

ఆతనికి ఉద్యోగము మీద అరుచి పుట్టినది. చికిత్సకులు "యిది మంచిదే" అనిరి. వ్యవహారమంతయు తేలిపోయినది. దస్తావేజు తయారయినది. పోటీలమీద రావులయ్య ఆ యెకరము భూమిని మూడువేలకు పుచ్చుకొనియెను.

యుక్త సమయమున రామచంద్రపురమున దస్తావేజు రిజస్టరీ అయ్యెను. కచేరీలోనే అప్పుతీర్చి వేయగా అన్నియు పోను నూటయేబది రూపాయలు మిగిలెను. "చాప చిరిగితే చదరకూడా అయింది కాదు." అనుకొనుచు దు:ఖముతో నాతడు మిత్రుని రాక నిరీక్షించుచు శేషగిరిరావు కాఫీహోటలు అరుగు మీద కూర్చుండెను.

## 10

శేషగిరిరావు జూచి "లోపలికి రారేం?" అని యడుగగా రామయ్య "యేమీ లేదు" అనియెను. ఇంతలో స్నేహితుడు వచ్చెను. "రాత్రి పదిగంటలకి గాని యింటికి చేరలేం, రా కాస్త కాఫీ పుచ్చుకుందాం" అని యాతడు పిలువగా రామయ్య బలవంతము మీద లోపలకు వెళ్ళెను. ఆవడల పళ్ళెము ముందు ఉంచుచు శేషగిరిరావు "సంగతి అంతా విన్నాను. ఉద్యోగం సరదా తీరిందా? వెఱ్ఱి ఆలోచనలు చేసి ఆ మిగిలిన నూరు పై చిలుకూ గూడా బుగ్గి చేసుకోక వచ్చి యీా వూళ్ళో కిల్లీల దుకాణం పెట్టుకో. నా అరుగు అద్ది లేకుండా యిస్తాను" అని చెప్పెను. స్నేహితుడు "మంచి ఆలోచనరా" అనియెను.

రామయ్యకు గొప్పవరము దొరికినట్లయినది. మఱునాడే వచ్చి దుకాణము సద్దెను. ఇనస్పెక్టరు చూచి "నేను చాలా విచారిస్తున్నాను" అనియెను. కొందరు మిత్రులు "యింతకంటే దారి లేకపోయిందిటరా" అనిరి. మరికొందఱు వెక్కిరించిరి. బ్రాహ్మణుడు కిల్లీ దుకాణము పెట్టుట చూచి అనేకులు తెల్లపోయిరి.

రామయ్య దేనికిని జంకలేదు. ఆతడు ప్రవృత్తిని పూర్తిగా మార్చుకొనియెను. భార్య యింట సర్వాధికారము వహించి అంతయు చక్కగ నడుపుచుండెను.

రెండుసంవత్సరములు గడచిన తరువాత రామయ్య రెండెకరాల భూమి కొని యింటి ప్రయత్నము చేయుచున్నట్లు తెలిసింది.

❀ ❀ ❀